WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com


# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి సంపుటి : 12 సంచిక : 276 బుధవారం 04-2-2026 పేజీలు : 8 వెల : 5-00

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3(ఆర్ఎన్ఎ):
ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం.

మిగతా 2లో

## యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు






- రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల
- రైతులతో ముఖాముఖి ముచ్చటించిన మంత్రి
- తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు
- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

హైదరాబాద్,ఫిబ్రవరి 3**నవతరం**
రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను

మిగతా 2లో

ట్రంప్ ఒత్తడికి

## ప్రధాని తలొగ్గారు

- మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు
- అదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది
- అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3**నవతరం**
అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిం దని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు.
నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని

మిగతా 2లో

## తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

కేబినెట్‌కు ముందు ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు భేటీ



2లో

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కెటిఆర్ విమర్శలు




హైదరాబాద్,ఫిబ్రవరి 3**నవతరం**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ

మిగతా 2లో

## పదేళ్ల పాటు నిరుద్యోగుల ఉసురుపోసుకున్న బిఆర్ఎస్

కాంగ్రెస్ వచ్చాకే నియామకాలు చేపట్టిన సిఎం రేవంత్

బిఆర్ఎస్ దొంగ ఏడుపులపై మండిపడ్డ ఎమ్మెల్సీ బల్మూరి



వివరాలు 2లో

## కల్తీ నెయ్యి వ్యవహారంలో సిట్ నివేదిక

- రాష్ట్ర ప్రభుత్వానికి అందచేసిన సిట్
- పలు ఉల్లంఘనలపై నివేదికలో వివరాలు వెల్లడి



2 లో




## రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ

రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి3 **నవతరం**
రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే

- మిగతా 2లో పేజిలో

# పదేళ్ల పాటు నిరుద్యోగుల ఉసురుపోసుకున్న బిఆర్ఎస్

హైదరాబాద్,ఫిబ్రవరి3 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి.. కాంగ్రెస్ పార్టీని గెలిపించింది నిరుద్యోగులేనని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొలువుల పండగ ఎలా జరిగిందో తెలంగాణ యువతకి తెలుసునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఎందుకు ఇచ్చామంటే యువతకి భరోసా కల్పించేందుకేనని వివరించారు. నోటిఫికేషన్స్ ఇస్తే కొలువు వస్తుందనే భరోసా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు కల్పించామని చెప్పారు. మంగళవారం నాడు నాంపల్లిలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేటీఆర్ 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలను అంగట్లో సరకులు అమ్మినట్టు అమ్మారని విమర్శించారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను బాధపెట్టిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులపై మండిపడ్డారు బల్మూరి వెంకట్. వాళ్లకి చిత్తశుద్ధి ఉంటే 10 ఏళ్లలో అమ్ముకున్న ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం.. కేసీఆర్, కేటీఆర్ గడీ కాదన్నారు. తాజాగా టీజీపీఎస్సీ వన్ టైమ్ పాస్ వర్డ్ రిజిస్టార్లు ప్రాసెస్ చేస్తుందని వివరించారు. పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ చేస్తామంటూ.. ఇప్పుడు ఎవరిని రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారంటూ కేటీఆర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే భారీ ప్రకటన చేస్తారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను నమ్మకండంటూ యువతకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో సిట్ నివేదిక

అమరావతి,ఫిబ్రవరి3తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై సుప్రీం కోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం రాష్ట్ర ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించింది. 2019-2024 మధ్య కాలంలో జరిగిన ఘోర తప్పిదాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఉద్దేశ్యపూర్వక మోసాలను వివరిస్తూ 11 పేజీల లేఖలో సిట్ తన దర్యాప్తు అంశాలను పేర్కొంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. 2020లో ఎటువంటి అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండర్ కండిషన్లు మార్చారు. దీంతో అర్హత లేని కంపెనీలకు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. 2020-2023 మధ్య ఈ అర్హత లేని కంపెనీలే కల్తీ నెయ్యి సరఫరా చేశాయి.
నెయ్యి సరఫరా సంస్థలకు కనీసం రూ.250 కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనను రూ.150 కోట్లకు తగ్గించారు. డైరీ రంగంలో 3 ఏళ్ల అనుభవం ఉండాలన్న నియమాన్ని 1 ఏడాదికి కుదించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధనను పూర్తిగా తొలగించారు. అలాగే, 12 టన్నుల వెన్న తీయాల్సిన నిబంధనను 8 టన్నులకు తగ్గించారు. పర్చేజ్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా చెవిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి పాత్రను సిట్ నిర్ధిష్టంగా ప్రస్తావించింది. టెండర్ కండిషన్ల మొదలుకొని నెయ్యి సరఫరా వరకు ప్రతి అంశంలో ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది. మొత్తం పక్రియ తప్పుదారి పట్టడంలో బాలాజీ, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బాధ్యులని పేర్కొంది.

## వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి మైలురాయి



నాయకత్వంలో ఈ ఒప్పందం కుదరడంపై సీఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ద్వారా ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సీఎం పేర్కొన్నారు. నిరంతరం ప్రపంచ వృద్ధిని కాంక్షించేలా ఈ దార్శనిక నిర్ణయం ఉందని వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా తన పాత్రను సుస్థిరం చేసుకుంటోందన్నారు సీఎం. భారత ఎగుమతుల్లో పోటీతత్వాన్ని గణనీయంగా పెంచేలా ఒప్పందం ఉందన్నారు.

## వాణిజ్య ఒప్పందం స్థిరత్వానికి మైలురాయి

అమరావతి,ఫిబ్రవరి 3 అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలు రాయి అని సీఎం చంద్రబాబు అన్నారు. దీన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. టారిఫ్‌లను 18శాతంకు తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇది నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంటోందన్నారు. ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ముఖ్యంగా ఏపీలోని యువత, రైతులకు విస్తృత అవకాశాలను సృష్టించనుందని చంద్రబాబు పేర్కొన్నారు .భారత్ - అమెరికాల మధ్య కుదిరిన చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని చంద్రబాబు నాయుడు స్వాగతించారు.
ఈ ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి చారిత్రాత్మక మైలురాయి అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ ఒప్పందం కుదరడంపై సీఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ద్వారా ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని సీఎం పేర్కొన్నారు.

# యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు

(మొదటి పేజి (తరువాయి)

మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వపించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు.



అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

(మొదటి పేజి (తరువాయి)

ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు. 2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది.

## తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

అమరావతి,ఫిబ్రవరి 3
తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.
శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు.

# ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు



(మొదటి పేజి (తరువాయి)

గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ..
'అదానీపై అమెరికాలో కేసు ఉంది.
నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్స్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

## అధ్వాన్న రోడ్డు దుస్థితిపై ఆందోళన

జనగామ,ఫిబ్రవరి 3 రోడ్డు అధ్వాన్నంగా ఉన్నప్పటికీ పట్టించుకోక పోవడంపై గ్రామంలోని యువత ఏకమయ్యింది. సమస్యపై ధర్నాతో అధికారుల దృష్టికి తీసుకుని వచ్చింది. జనగామ జిల్లాలోని కొడవటూరు కమాన్ క్రాస్ నుంచి బచ్చన్నపేట ఎస్సార్ పెట్రోల్ బంక్ వరకు గుంతలమయంతో అధ్వానంగా మారిన జనగామ- సిద్దిపేట రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ ఫైట్ ఫర్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో మంగళవారం భారీ రాస్తారోకో ధర్నా నిర్వహించారు. రెండు గంటల పాటు నిర్వహించిన ధర్నాలో జనగామ, ఆలేరు, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు ఎక్కడెక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా ప్రతిరోజు ఎంతోమంది ఈ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో జమాఖర్చులపై నిఘా

### ప్రతిపైసనూ లెక్కించనున్న అధికారులు

నిజామాబాద్,ఫిబ్రవరి 3 :మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లపై అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం సోమవారం జరిగింది. మంగళవారం ఉపసంహరణలకు చివరి తేదీ కావడంతో ఎవరు బరిలో ఉన్నారన్నది ప్రకటించనున్నారు. పోలింగ్ ఈనెల 11న జరుగనుండగా మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారంపై అభ్యర్దులు చేసే ఖర్చు లెక్కింపు అధికారికంగా అమలులోకి వస్తుంది. ఎన్నికల ఖర్చును నిశితంగా తనఖీ చేస్తారన్న విషయాన్ని ప్రతీ అభ్యర్థి గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. ఖర్చు రిజిస్టర్‌ను నిర్వ హిస్తున్నారా?

ప్రతీ ఖర్చుకు బిల్ లేదా రశీదు ఉందా? ఖర్చు పరిమితి దాటిందా? పార్టీ చేసిన ఖర్చు మీ ఖర్చులో చూపించారా?, సోష ల్ మీడియా ఖర్చు చేపించారా? ప్రచారానికి ఎన్ని వాహనాలు వాడుతున్నారు? అనుమతి తీసుకున్నారా? వాహనాలపై ప్లెక్సీలు అనుమతి మేరకే ఉన్నాయా? ర్యాలీలు, రోడ్ షోలు అనుమతి తీసుకున్నారా? తదితర వాటిని తనిఖీ చేస్తారు. కనుక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశిరచిన నియమ నిబంధనలను తూ.చ. తప్పక పాటించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారానికి గడువు వారం రోజులే ఉండడంతో బరిలో నిలిచన అభ్యర్థులు హైరానా పడుతున్నారు. మరోవైపు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఖర్చు పరిమితిపై ఎన్నికల అధికారులు లెక్కింపు చేపట్టనున్నారు. పార్టీ అభ్యర్థి అయినా, స్వతంత్ర అభ్యర్థి అయినా ఇద్దరికీ ఖర్చు పరిమితి ఒకేలా ఉంటుంది. నగర పంచాయతీలకు రూ.2లక్షలు, గ్రేడ్3 మున్సిపాలిటీలకు రూ.3లక్షల వరకు, గ్రేడ్ 2 మున్సిపాలిటీలకు రూ.4లక్షల వరకు, గ్రేడ్1 మున్సిపాలిటీలకు రూ.5లక్షల వరకు అభ్యర్థులు ఖర్చు చేయవచ్చు. ప్లెక్సీలు, బ్యానర్లు, వాహనాల అద్దె, మైక్ లేదా డీజే, సభలు, సమావేశాల నిర్వహణ, సో షల్ మీడియా ప్రచారం, కార్యకర్తలకు భోజనాలు, తాగునీరుపై పెట్టిన వ్యయాలన్నిటినీ ఎన్నికల ఖర్చు కిందే లెక్కిస్తారు
. పార్టీ చేసిన ఖర్చు కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు. ప్రతీ అభ్యర్థి తప్పనిసరిగా ఎన్నికల ఖర్చుల రిజిస్టర్ నిర్వహించాలి. ఎన్నికల అధికారికి మధ్యలో, ఎన్నికల తర్వాత 30 రోజులలోపు రిజిస్టర్ తప్పక కూపించాలి. ఖర్చుల పరిమితి మించితే ఎన్నిక రద్దయ్యే ప్రమాదం ఉంది.

అనర్హత వేసే, భవిష్యత్తు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు విషయంలో పార్టీ అభ్యర్థికి ప్రత్యేక సడలింపు అంటూ ఏమీ ఉండదు. స్వతంత్ర అభ్యర్థికీ అదే పరిమితి వర్తిస్తుంది. అభ్యర్థుల ఖర్చులపై అధికారులు గట్టి నిఘా వేసి ఉంచుతారు. ప్రతీ రూపాయి లెక్కిస్తారు. అయితే అభ్యర్థి అనుమతితో లేదా ఆదేశంతో జరిగిన ప్రతీ ఖర్చు కచ్చితంగా లెక్కలోకి వస్తుంది.

## జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

**జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట**

**కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి**



జగిత్యాల,ఫిబ్రవరి 3
జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టిక్కెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనున్న ల్లోనే కేటాయించారు. ఆయన సూ చించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

## మరోమారు ఝలక్ ఇచ్చిన పసిడి ధరలు

**తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు**



హైదరాబాద్,ఫిబ్రవరి 3 తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో
అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

## గర్భిణికి ఎన్‌టి స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

**విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా**




హైదరాబాద్,ఫిబ్రవరి 3 తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ దయాగ్నో స్టిక్ సెంటర్‌కు వినియో గ దారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధిం చింది. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ దయాగ్నొస్టిక్ సెంటర్ ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో దయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ దయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన దయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ దయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

## రైతులకు తీవ్ర ద్రోహం చేసిన మోడీ

**ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి**

**అమెరికాతో వాణిజ్య ఒప్పందపై అఖిలేశ్ విమర్శలు**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 3 భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విరుచుకు పడ్డారు. ఈ ఒప్పందంతో కేంద్రం లోని బిజెపి నేతృత్వం లోని ప్రభుత్వం దేశ రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని ఆయన ఫైర్ అయ్యారు. ఈ ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయోత్పత్తులకు భారత్ మార్కెట్‌ను తెరవడం.. దాదాపు 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ద్రోహం చేసినట్లేనని ఆయన ఆరోపించారు. ఈమేరకు ఆయన మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'రైతులపై బిజెపి మళ్లీ దాడి చేసింది. ఈ ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. ఈ ఒప్పందం చేసుకోవాలని మీపై జరిగిన ఒత్తిడి ఏమిటి? అమెరికన్ వ్యవసాయోత్పత్తులు, ఆహార ధాన్యాలకు భారతదేశ మార్కెట్లను తెరవడం మన దేశ రైతులను మోసం చేయడమే. ఇప్పటికే దేశంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. స్వాతంత్యానికి ముందే బిజెపి సభ్యులు, వారి మిత్రపక్షాలు విదేశీయుల ఏజెంట్లుగా ఉన్నారు. నేటికీ వారు విదేశీ ఏజెంట్లుగానే ఉన్నారు. బిజెపి సభ్యులు, వారి మిత్రులు పదేపదే స్వావలంబన, స్వదేశీ గురించి మాట్లాడతారు. అలాంటిది.. దేశ ఆర్థిక వ్యవస్థను మోసం చేసినందుకు, అమెరికాతో ఒప్పందం చేసుకునేందుకు వారు ఎంత కమిషన్ సంపాదించారో ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి' అని ఎక్స్ పోస్టులో అఖిలేష్ నిలదీశారు. అలాగే బిజెపి అనుసరిస్తున్న విధానాలు రైతులపై మాత్రమే కాకుండా దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాలపై కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఎందుకంటే ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల నుండి లాభాలు ఆర్జించడానికి దారితీస్తుంది. దీనివల్ల కొత్తగా మధ్యవర్తులు ఆవిర్భవిస్తారు. ఫలితంగా అన్ని ఆహార పానీయాలు మరింత ఖరీదవుతాయి. అదే సమయంలో బిజెపీ ఈ కంపెనీల నుండి విరాళాలను కూడా సేకరిస్తుంది. దీనివలన ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరింత పెరుగుతాయి. క్రమంగా ఇది మన రైతుల వ్యవసాయాన్ని, వారి ఆదాయాన్ని తగ్గిస్తుంది. వారి భూమిని ధనవంతులకు, కార్పొరేషన్లకు అమ్మవలసి వస్తుంది. భూమిని స్వాధీనం చేసుకోవమే బిజెపి, వారి మిత్ర పక్షాల అంతిమ లక్ష్యం అని అఖిలేష్ ఎక్స్‌లో తీవ్రంగా విమర్శించారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కరీంనగర్,ఫిబ్రవరి 3:గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.
కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆర్ఎస్ బిజెపిల వ్లల ఒరిగేదేమీ లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి
నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురుమమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి
రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

## అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయండి: బండి



కరీంనగర్,ఫిబ్రవరి 3
: మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు కష్టపడి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.'నేను కేసీఆర్‌ని గజగజ వణికించా. నా తలకాయను కేసీఆర్.. ఆరు ముక్కలు చేస్తానని గతంలో అన్నారు. ఆయన సంగతి తేల్చేందుకు ఫామ్‌హౌస్‌కు వస్తానని చెప్పా. ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్‌ను బజార్‌కు లాక్కొచ్చా. కేసీఆర్ మెడలు వంచింది నేనే. నేను ఎవరికీ భయపడను. గడీల నుంచి కేసీఆర్‌ను నేనే బయటకు తీసుకువచ్చా' అని బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

**ఉచితాలను ప్రకటించడానికి కాదు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్,ఫిబ్రవరి 3
:ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమ ంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరా బాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు
. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## గరింగురోడ్డు విస్తరణలో 'రాజకీయ' మంటలు..

# మసీదు వద్ద హైడ్రామా



- భక్తుల పార్కింగ్ ప్లేస్ మాయం.. డ్రైనేజీ
- వ్యవస్థకు మరణశాసనం.. పూడికతీత అసాధ్యం- మురుగునీటి గండం పొంచి ఉందా?
- ప్రస్తుత ఎమ్మెల్యే 53 అడుగులకు పెంచినా
- అడ్డుకున్నదెవరు? తెరవెనుక ఎవరైనా నేత చక్రం తిప్పారా?
- డ్రైనేజీపై అక్రమ కట్టడాలు.. భక్తుల పార్కింగ్
- స్థలంపై కన్నేసిన 'వ్యాపార' రాజకీయం
- అధికార యంత్రాంగం నిస్సహాయత -- అక్రమ స్లాబ్ పనులకు చెక్ పడలేదు
- అధికారులను సహాయత వెనుక అసలు కారణం ఎవరి ఒత్తిడి?

-

ఖమ్మం భద్రాద్రి జిల్లా(నవతరం ప్రతినిధి): అశ్వారావుపేట మండల కేంద్రంలోని రింగురోడ్డు సెంటర్ అభివృద్ధి పనుల చుట్టూ ఇప్పుడు వివాదాలు ముసురుకున్నాయి. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నేషనల్ హైవే రోడ్డు మధ్య డివైడర్ నుండి 50 అడుగుల మేర విస్తరణ మరియు సెంట్రల్ లైటింగ్ పనులను ప్రతిపాదించగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రజా ప్రయోజనం దృష్ట్యా 53 అడుగులకు సవరించి నప్పటికీ, గతంలో క్షేత్రస్థాయిలో పనులు సజావుగా సాగనివ్వకుండా అడ్డుకోవడం వెనుక భారీ రాజకీయ వ్యూహం దాగి ఉన్నట్లు తెలుస్తోంది.

**విస్తరణ పనులపై మసీదు సిబ్బంది గొడవకు అసలు కారణం ఏమిటి?**

రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్న క్రమంలో మసీదు సిబ్బంది అడ్డుకోవడంతో అక్కడ తీవ్రస్థాయిలో గొడవలు జరిగినట్లు సమాచారం. దైవ ప్రార్థనలకు వచ్చే భక్తులకు కనీసం పార్కింగ్ స్థలం కూడా లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య వ్యాపార షట్టర్ల నిర్మాణానికి మార్గం సుగమం చేయడం కోసమే ఈ హైడ్రామా నడిపించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ గొడవలను ఆసరాగా చేసుకొని, రోడ్డు వెడల్పును అడ్డుకుంటూనే మరోవైపు అక్రమ కట్టడాలను పూర్తి చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరుడుగట్టిన ఓ రాజకీయ నేత హస్తంతోనే ఈ అక్రమ సామ్రాజ్యం విస్తరిస్తోందనీ ప్రజలు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. ఇదంతా భక్తునిపై ప్రేమ కాదు కానీ రాజకీయ ముసుగులో అమిత ప్రేమని మేధావులు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. అధికారులు మౌనం వహిస్తున్నారా? రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బేఖాతరు చేస్తున్నారా? ఫోన్ చేస్తే అనుమతులు లేవు అని చెబుతున్నారే తప్ప పనులను ఆపడానికి మాత్రం సాహసించడం లేదు. ఇది అధికారులకు మరియు కొందరు రాజకీయ నేతలకు మధ్య ఉన్న "లోపాయికారీ" ఒప్పందానికి నిదర్శనం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ నుండి ఎలాంటి అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా వాణిజ్య షట్టర్ల నిర్మాణం వెనుక దాగి ఉన్న రాజకీయ రంగు బయటపడనుందా? అధికారులకు ఫిర్యాదు చేసినా, "మున్సిపల్ ఎన్నికల బిజీలో ఉన్నాం" అని సాకులు చెబుతూ ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటున్నారే తప్ప, నిర్మాణాలను అడ్డుకోవడం లేదు.

**డ్రైనేజీ కాల్వపై అక్రమ సామ్రాజ్యం**

నియమ నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ కాల్వను ఆనుకొని పిల్లర్లు వేసి, స్లాబ్ వేయడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం లాభార్జనే తప్ప ప్రజా ప్రయోజనం కాదు. రేపు వర్షాకాలంలో డ్రైనేజీ పూడిక తీయడానికి వీలు లేక రోడ్డంతా జలమయమైతే, ఆ అక్రమ కట్టడాలను కూల్చే దమ్ము అధికారులకు ఉందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థకు మాత్రం తప్పకుండా ఈ రాజకీయ గండం ఉంది. డ్రైనేజీని కప్పేస్తూ పిల్లర్లు వేసి స్లాబ్ వేయడం అత్యంత ప్రమాదకరమైన చర్య. రేపు డ్రైనేజీలో పూడికచేరి మురుగునీరు నిలిచిపోతే కనీసం క్లీన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా ఈ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డు మొత్తం చెరువులను తలపించే ప్రమాదం ఉంది. కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారా? అని ' నవతరం' పత్రిక ప్రశ్నిస్తోంది ఇప్పటికే నేషనల్ హైవే అధికారులు తమ చేతులెత్తేయగా, రెవెన్యూ శాఖ నివేదికల పేరుతో కాలయాపన చేస్తోంది.

ఇదంతా కేవలం ఎన్నికల ముందు మెజారిటీ ఓట్ల కోసం, కొందరు వ్యాపారులకు లబ్ధి చేకూర్చడం



నిబంధనలకు పాతర, పర్మిషన్లు లేని షట్టర్లు





కోసం చేస్తున్న 'చిత్తశుద్ధి లేని' నాటకంలా కనిపిస్తోంది. పత్రికా ముఖంగా ఎన్ని ఆధారాలు చూపిస్తున్నా పట్టించుకోని అధికారుల తీరుపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 'నవతరం' పత్రిక వేస్తున్న ప్రశ్నలకు సమాధానం ఏది? మసీదు భక్తుల పార్కింగ్ స్థలాన్ని కబళించి, డ్రైనేజీపై అక్రమ షట్టర్లు కట్టడానికి సహకరిస్తున్న ఆ 'హస్తం' ఉన్న నేత ఎవరు?

నవతరం హెచ్చరిక: ప్రజా సౌకర్యాలను తాకట్టు పెట్టి సాగిస్తున్న ఈ అక్రమ కట్టడాలపై జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో ఈ అక్రమ రాజకీయాన్ని బహిర్గతం చేస్తూ ప్రజల పక్షాన పోరాటం సాగిస్తాం.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇది ప్రభుత్వ భూమి ఔనా కాదా అన్నది రెవెన్యూ అధికారులతో తేల్చాలి. లేనిపక్షంలో ఈ అక్రమ కట్టడాల వల్ల భవిష్యత్తులో అశ్వారావుపేట ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. అధికారులు నిర్లక్ష్యంపై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శీర్షిక

## అంతిమ యాత్ర



మంచితనాన్ని మంటకలిపి పైకం వెనకాల
పరుగెత్తి
పరుగెత్తి అలసిపోయి కట్టెల పాన్పుపై
ఆదమరిచి
కనురెప్పలు అర్పి నిద్రపోతున్న ఓ మనిషి
నీ వెంట ఏమి రాదు అని గ్రహించిలేక
పోయినావు
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా
బత్రకాలి

నీ బంధుగణంకోసం, నీ రక్తసంబంధం
కోసం
నీ వాళ్ళ కోసం కుళ్ళు కుతంత్రాలు చేసి
కూడబెట్టిన నీ పైకంపై డేగలా వాలారే
తప్ప
ఒక్కరు కూడా నీ దరిదాపుల్లోకి రాలేదు
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా
బత్రకాలి

బందుజనం స్మశానం వరకు....
తలపై రూపాయి నాణెం ఒంటిపై తెల్లని
వస్త్రం
నోట్లో గుప్పెడు బియ్యం నీతో కలిసి
బూడిద
అయితాయే తప్ప నీతో కలిసిరావు
ఒక్క నీ మంచితనం తప్ప అదితెలుసుకో
లేక
పోయావా ఓ మనిషి..!
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా
బత్రకాలి

సంపాదించు కోవాల్సింది కేవలం
ఆస్తిఅంతస్తులు
మాతమే కాదు నలుగురు మిత్రులని
కూడా
అని మరచి పోయావా ఓ మనిషి..!
చివరి అంతిమ యాత్రలో మోయడానికి
నేను అంటే నేను అని పోటీపడాలి అలా
బత్రకాలి

నీకు చేతనైతే నలుగురికి సాయంచేయి,
కానీ
కీడు మాత్రం చేయకు అని
కోరుకుంటూ...

మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం.
చరవాణి 9347042218

## అక్రమ మద్యం పట్టివేత..

**- కౌన్సిలర్ అభ్యర్థిపై కేసు నమోదు**





?రాజన్న సిరిసిల్ల, నవతరం: మున్సిపల్ ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సిరిసిల్ల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శివనగర్‌కు చెందిన శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై సుమారు 19,800 రూపాయల విలువైన మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.?30వ వార్డు ఓ పార్టీ అభ్యర్థి తరపున ఓటర్లకు పంచేందుకు ఆమె భర్త మరో వ్యక్తి ఆదేశాల మేరకు ఈ మద్యాన్ని తీసుకెళ్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. పోలీసులు మద్యం, బైక్‌ను సీజ్ చేసి, నలుగురుపై కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించి మద్యం, నగదు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

# జాతరలు పవిత్ర ఉత్సవాలు








కుత్బుల్లాపూర్, నవతరం: తన స్వగ్రామమైన కుత్బుల్లాపూర్‌లో కొలువుదీరిన శ్రీ వేణుగోపాల స్వామి జాతరలో బి.ఆర్.ఎస్. ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతరలు దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి నిర్వహించే పవిత్ర ఉత్సవాలని, అలాగే మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు అందించే గొప్ప ఉత్సవాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో కలసి ప్రత్యేక పూజల్లో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొందారు, అలాగే గ్రామాభివృద్ధితో పాటు సంప్రదాయాలను కాపాడటమే తమ లక్ష్యమని వారు గుర్తు చేశారు..ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఇంద్రసింగ్ ఠాకూర్, శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, బలవంత రెడ్డి పటేల్, సామల నరసింహ రెడ్డి, పెద్ది మల్లేష్, మురళి గౌడ్, నార్లకంటి నాగేష్, బిక్షపతి గౌడ్, నరహరి, కె. ఎం. ప్రకాష్ గౌడ్, నార్లకంటి శ్యామ్, ఆటో బలరాం, కుంట వేణు, డివిజన్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, 130 డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# డ్రైనేజి పనులు పరిశీలించిన కార్పొరేటర్



కుత్బుల్లాపూర్, నవతరం: గాజులరామారం పరిధిలో రావి నారాయణరెడ్డి నగర్ ఫేస్ టు లో డ్రైనేజీ పనులను పరిశీలించారు బిజెపి నాయకులు, గాజుల రామారం కార్పొరేటర్ రావుల శేషగిరి. ఈ కార్యక్రమంలో లక్కోజి మురళీకృష్ణ, పల్లపు, శ్రీను, మహేష్ రావి నారాయణరెడ్డి నగర్ బస్తీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన గుర్రంపాడు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్

నల్గొండ, నవతరం: నల్గొండ జిల్లా, గుర్రంపోడ్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏసీబీ వలలో చిక్కుకున్నారు.. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం రోజు మధ్యాహ్నం సుమారు ఒంటిగంట ప్రాంతంలో సదరు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొహమ్మద్ అబ్దుల్ హకీం గుర్రంపోడ్ మండలంలోని ఎంఆర్వో కార్యాలయ ప్రాంగణంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకురెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

కాగా బాధితుడికి చెందిన సర్వే నెం. 225/6, విస్తీర్ణం ఎకరాలు 1.15 గుంటలు గల భూమికి సంబంధించి, ఆన్‌లైన్ 1-బి రిజిస్టర్ అంటే ఆర్ ఓ ఆర్ లో తొలగించబడిన భూమి వివరాలను తిరిగి చేర్చేందుకు బాధితుడి దరఖాస్తు, సంబంధిత ఫైల్‌ను తహసీల్దార్‌కు ప్రాసెస్ చేసి పంపించడానికి గాను ఆ అధికారి రూ. 2,20,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో పట్టుబడ్డారు. రూ. 20,000/- లంచం మొత్తం అతని వద్ద నుండి స్వాధీనం చేసుకోవడం జరిగింది. బాధ్యత గలిగిన అధికారిగా ఉంటూ.. తన విధులను అక్రమంగా, అనైతికంగా నిర్వహిస్తూ, అనుచిత లాభం పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

అందువల్ల, నిందిత అధికారిని అరెస్టు చేసి, హైదరాబాద్‌లోని అదనపు ప్రత్యేక న్యాయమూర్తి (ఎస్‌పీఈ అండ్ ఏసీబీ కేసులు) కోర్టు ముందు హాజరుపరచడం జరిగింది.. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది. కాగా భద్రతా కారణాల దృష్ట్యా, ఫిర్యాదుదారు పేరు, వివరాలు గోప్యంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు..

ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లయితే, ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 ను సంప్రదించి చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా సహకరించవలసిందిగా అధికారులు కోరుతున్నారు.. అలాగే ఏసీబీ తెలంగాణ అధికారులను వాట్సాప్ : 9440446106



# తెలంగాణలో భూముల ధరల పెంపునకు రంగం సిద్ధం!



హైదరాబాద్, ఫిబ్రవరి 3,నవతరం : తెలంగాణ ప్రభుత్వం భూముల ధరలను సవరించడంపై సమగ్ర అధ్యయనం చేయాలని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ నిర్ణయించింది. దీనిపై త్వరలో రాష్ట్రంలో భూముల విలువ పెంచే అవకాశం ఉంది. గత ఏడాది హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు లోపల భూముల విలువ సవరణ ప్రతిపాదనలు సిద్ధం చేసినా, ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టింది. జీహెచ్ఎంసీ తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ సవరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. భూముల ధరలు పెరిగితే రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ ఛార్జీలు పెరిగి రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ప్రభావం చూపనుంది.

# సెల్‌ఫోన్లు దొంగిలించి.. యూపీఐతో నగదు మళ్లించి..



సూరారం, నవతరం: సెల్‌ఫోన్‌ను దొంగిలించి యూపీఐ ద్వారా నగదును కొల్లగొడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సూరారం ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ తెలిపారు. నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్ మొబైల్ ఫోన్‌ను దొంగిలించి, డిజిటల్ పేమెంట్స్ ద్వారా భారీగా నగదును అక్రమంగా కాజేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.జనవరి 7వ తేదీ తెల్లవారుజామున హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ చోరీకి గురైందని, ఆ మొబైల్‌లోని యూపీఐ యాప్ ద్వారా బాధితుడి ఖాతా నుంచి సుమారు రూ.8,00,000/-లను నిందితుడు అక్రమంగా మళ్లించినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా సూరారం క్రైమ్స్ టీమ్ సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు బ్యాంక్ లావాదేవీలను సాంకేతిక ఆధారాలతో విశ్లేషించి నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. మెదక్ జిల్లా కవిడిపల్లి గ్రామానికి చెందిన బూరడ ఆది నారాయణ (34)గా నిందితుడిని నిర్ధారించి అతడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడిన ఒక మొబైల్ ఫోన్‌తో పాటు రూ.6,73,000/- నగదును స్వాధీనం చేసుకున్నామని, రికవరీ చేసిన మొత్తం సొత్తు విలువ సుమారు రూ.7,00,000/- వరకు ఉంటుందని వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కేసును తక్కువ సమయంలోనే ఛేదించిన సూరారం క్రైమ్ టీమ్ సిబ్బందిని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజలు ఆసుపత్రులు మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లకు, బ్యాంకింగ్ యాప్స్‌కు తప్పనిసరిగా సెక్యూరిటీ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# బొమ్మ, బొరుసు... అరెస్ట్



కొల్చారం, నవతరం: కొల్చారం పీఎస్ పరిధిలోని దుంపలకుంట గ్రామంలో బొమ్మ బొరుసు ఆడుతున్న 6 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,054 నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ తెలిపారు.

# 22 స్థానాల్లో బీఆర్ఎస్ జండా ఎగరవేస్తాం

- పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవు
- మున్సిపల్ ఇన్చార్జ్ పట్నం మాణిక్యం
- కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపు



గుమ్మడిదల మున్సిపాలిటీ, నవతరం: గుమ్మడిదల మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ పూర్తిస్థాయిలో ఎన్నికల బరిలో నిలిచిందని మున్సిపల్ ఇంచార్జ్ పట్నం మాణిక్యం స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, నాయకత్వం నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు అందరూ ఒకే దిశగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. పార్టీ నిర్ణయాలపై స్పష్టత ఉందని, అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత పాటించామని వివరించారు. ఎవరికీ అన్యాయం జరగలేదని, పార్టీ ప్రయోజనాలే ప్రధానంగా నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. పార్టీ నిర్ణయాలే అందరికీ మార్గదర్శకమని, వాటిని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని, ప్రతి వార్డులో పార్టీ కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారం క్రమబద్ధంగా కొనసాగుతోందని, ప్రజల్లో పార్టీపై విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. గత పాలనలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులే ఎన్నికల్లో పార్టీకి ప్రధాన బలంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధిలో బీఆర్ఎస్ చేసిన పనులను ప్రజలు గుర్తుంచుకుంటున్నారని చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న 22 మంది అభ్యర్థులకు పార్టీ బీఫామ్‌లను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ ఇంచార్జ్ పట్నం మాణిక్యం ముఖ్యఅతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పార్టీ కమిటీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ప్రచారంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యాచరణ సాగుతోందని తెలిపారు. అనవసర వ్యాఖ్యలు, అపోహలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల రోజు వరకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, బూత్ స్థాయి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరును కలవాలని, పార్టీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు.

గుమ్మడిదల మున్సిపాలిటీలో 22 స్థానాల్లో బీఆర్ఎస్ విజయమే తుది లక్ష్యమని, అదే దిశగా పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని పట్నం మాణిక్యం స్పష్టం చేశారు. పార్టీ ఐక్యతే ఈ ఎన్నికల్లో విజయానికి ప్రధాన బలమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆర్డినేటర్ తొంట ఆంజనేయ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, హుస్సేన్, మొగులయ్య, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ, పి.శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి ఫయాజ్, పోచయ్య, సత్యనారాయణ, వీరస్వామి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# వసూళ్లపై విచారణకు ప్రత్యేక పోలీసు బృందం



ఖమ్మం, ఫిబ్రవరి 3, నవతరం:
ఖమ్మం జిల్లాలో మంత్రి పేరుతో ఉద్యోగాలు, పదవులు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుండటంతో, సీపీ సునీల్ దత్ స్పందించి పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు కూడా రంగంలోకి దిగి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

# పోలీస్ జాగిలాలతో గంజాయి తనిఖీలు




భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 3, నవతరం : భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ సూచనలతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి హాట్‌స్పాట్స్ తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి హాట్‌స్పాట్స్ గా గుర్తించబడిన ప్రదేశాలలో ఈ తనిఖీలు చేపట్టడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.ఈ తనిఖీలను నిర్వహించడం కోసం మత్తు పదార్థాలను కనిపెట్టే పోలీస్ జాగిలాలను ఉపయోగించడం జరిగిందని వివరించారు.ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్లుగానీ, అక్రమ రవాణా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సీఐ కోరారు.

# సౌమ్య కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం



హైదరాబాద్, నవతరం: ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమనిఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలు సమకూర్చుతామని చెప్పారు. నిజామాబాద్‌లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు.

అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. వారం రోజులపాటు చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు.

నవతరం
నేటితరం కోసం...





# సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ

అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్-10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది.




# భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నా..

**పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారు**
**భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడి**

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ గెలుపు అవకాశాలపై రోహిత్ శర్మ కీలక విషయాలు మాట్లాడారు. హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తారని, వారి ఆల్ రౌండ్ నైపుణ్యం, డెత్ ఓవర్ల బౌలింగ్‌కు ప్రాధాన్యతనిచ్చారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని, వికెట్ తీసే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా గెలుపు అవకాశాలపై భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మెగా టోర్నీలో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. జట్టులో హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ పాత్ర అత్యంత కీలకమని రోహిత్ నొక్కి చెప్పారు. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా అందించే ఆల్ రౌండ్ బ్యాలెన్స్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు పెద్ద ఊరటనిస్తుందని తెలిపారు. అర్షదీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడని, 2024 ఫైనల్‌లో అతని ప్రదర్శనను ప్రశంసించారు.

స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి సవాల్‌గా మారతారని పేర్కొన్న రోహిత్.. మంచు ప్రభావం వల్ల ముగ్గురు స్పిన్నర్లతో ఆడటం రిస్క్ అని హెచ్చరించారు. వికెట్ తీయగలిగే బౌలర్లకే తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో కుల్దీప్ యాదవ్‌పై సరదాగా వ్యాఖ్యానిస్తూ, "గల్లీ క్రికెటర్‌లా ప్రతి బంతికి అప్పీల్ చేయొద్దు, రివ్యూల విషయంలో నేను కుల్దీప్‌ని నమ్మను" అని చమత్కరించారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ఈ టోర్నీలో భారత జట్టు విజయం సాధించాలని రోహిత్ ధీమా వ్యక్తం చేశారు.

# కొలంబోలో అడుగుపెట్టిన పాకిస్తాన్ టీమ్

## వివాదాల మధ్యే శ్రీలంకకు పాకిస్తాన్ జట్టు- ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్






ఐసీసీ టీ - 20 వరల్డ్ కప్ 2026 కోసం పాకిస్తాన్ జట్టు కొలంబో చేరుకుంది. అయితే, భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు టోర్నీ ఆదాయంపై కూడా ప్రభావం పడనుంది. మాజీ ఆటగాళ్లు ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలుపుతుండగా, ఐసీసీ పునరాలోచించాలని సూచించింది. ఫిబ్రవరి 15న అసలు ఏం జరుగుతుందో చూడాలి!ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు పాకిస్తాన్ జట్టు శ్రీలంక రాజధాని కొలంబోకు చేరుకుంది

. భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే అంశంపై కొనసాగుతున్న వివాదాల మధ్యే పాకిస్తాన్ జట్టు శ్రీలంకకు రావడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సల్మాన్ అలీ ఆఘా నాయకత్వంలో ఉన్న 15 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టు సోమవారం కొలంబో చేరుకుంది. భారత జట్టుతో ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌లో పాల్గొనవద్దని పాకిస్తాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, ఈ నిర్ణయం చుట్టూ పెద్ద ఎత్తున వివాదం నెలకొంది.టోర్నీకి ముందు సన్నాహాలపై ప్రస్తుతం పాకిస్తాన్ జట్టు దృష్టి సారించింది. మంగళవారం ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన జట్టు, బుధవారం ఐర్లాండ్‌తో జరిగే ఏకైక వార్మప్ మ్యాచ్‌లో పాల్గొననుంది. ఈ మ్యాచ్ సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనుంది. ఇదే మైదానం గ్రూప్-ఏలో పాకిస్తాన్ ఆడే మూడు మ్యాచ్‌లకు వేదిక కానుంది.గ్రూప్-ఏలో పాకిస్తాన్‌తో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా జట్లు ఉన్నాయి.

పాకిస్తాన్ ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే భారత్ మ్యాచ్ బాయ్‌కాట్ అంశంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో చిక్కుకుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని ఐసీసీ ఇప్పటికే సూచించినట్లు సమాచారం. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐసీసీ

హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది.భారత్--పాకిస్తాన్ మ్యాచ్ జరగకపోతే టోర్నీ ఆదాయంపై కూడా తీవ్ర ప్రభావం పడనుంది. ప్రసార హక్కుల

సంస్థ జియోస్టార్ ఇప్పటికే తమ ఒప్పందంపై పునర్విమర్శ కోరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# ద్రవిడ్ సేన ముందు గంభీర్ టీమ్ జుజుబీ

**టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే**




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గత టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన భారత జట్టుతో పోల్చితే ప్రస్తుత టీమ్ బలంగా ఉన్నప్పటికీ, చాలా విషయాల్లో వెనుకంజలో ఉందన్నాడు. రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోని రోహిత్ సేన.. ప్రస్తుత గంభీర్ పర్యవేక్షణలో సూర్య టీమ్ కంటే గొప్పదని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 టోర్నీలో రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో 11 ఏళ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు రోహిత్ సేన తెరదించింది. సౌతాఫ్రికాతో ఉత్కంఠగా సాగిన ఫైనల్లో విజయం సాధించిన భారత్ రెండో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. కీలకమైన సమయాల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా అనుభవం భారత విజయానికి కలిసొచ్చింది.ఈ విజయానంతరం ఈ ముగ్గురు ఆటగాళ్లు అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికారు. దాంతో భారత టీ20 క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో మరో జట్టు రెడీ అయ్యింది. గత రెండేళ్లలో 9 ద్వైపాక్షిక సిరీస్‌లను సూర్యసేన గెలిచి హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. తాజాగా అధికారిక బ్రాడ్‌కాస్టర్ షోలో మాట్లాడిన అనిల్ కుంబ్లే.. రోహిత్ సేన గొప్పదని అభిప్రాయపడ్డాడు. 'అనుభవం గురించి మాట్లాడితే టీమిండియా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను కోల్పోయింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించారు. జట్టు సమతూకం గురించి మాట్లాడితే సూర్యసేన బలంగా ఉంది. ఎందుకంటే ఈ జట్టులో చాలా బౌలింగ్ ఆప్షన్స్ ఉన్నాయి. బ్యాటింగ్‌లో దూకుడైన అప్రోచ్‌తో భీకరంగా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీ సవాల్‌గా ఉంటుంది. 2024లో పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. ఈ జట్టు కంటే రోహిత్ సేన 10 శాతం ముందుందని చెబుతాను. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో విరాట్ కోహ్లీ, అక్షర్ పటేల్ తీవ్ర ఒత్తిడిలో మెరుగైన ప్రదర్శన కనబర్చారు. తాజా టోర్నీలో అలాంటి ప్రదర్శనలు రిపీట్ కావాలి. సూర్య ఫామ్‌లో ఉండటం ముఖ్యం. క్లిష్టపరిస్థితుల్లో అతను రాణిస్తేనే భారత్ గెలుస్తుందని గ్రహించాలి.'అని అనిల్ కుంబ్లే చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి రంగం సిద్ధమైంది. ఆదివారం( ఫిబ్రవరి 7) ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. అమెరికాతో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తమ క్యాంపైన్‌ను మెదలు పెట్టనుంది. ఫిబ్రవరి 7న అమెరికాతో, ఫిబ్రవరి 12న నమీబియాతో, ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో, ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్‌తో భారత్ తమ లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది.

# తారాజువ్వలా ఇషాన్ కిషన్






- **గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్**
- **టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?**
- **అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్**

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.




## విదేశాల నుంచి 40 గ్రాముల వరకు బంగారం తెచ్చుకోవచ్చు

ఫిబ్రవరి 3: ఇటీవలి కాలంలో బంగారం ధరల్లో సుమారు 394% మేర పెరుగుదల వచ్చిన నేపథ్యంలో బ్యాగేజీ నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది. బ్యాగేజీ నిబంధనలు-2026 అమల్లోకి తెచ్చింది. ఇవి ఇవాళ్టి నుంచే అమల్లోకి వచ్చాయి. ఫలితంగా విదేశాల నుంచి విమానం లేదా సముద్ర మార్గాల్లో మనదేశానికి వచ్చే ప్రయాణికులు మహిళలైతే 40 గ్రాములు, పురుషులైతే 20 గ్రాముల వరకూ డ్యూటీ ఫ్రీగా బంగారు ఆభరణాలు తెచ్చుకోవచ్చు.అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధానిరైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్..బీ ఫామ్ దక్కేదెవరికో..?అలాంటి వారికి పోలీసు ట్రీట్మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగ అజిత్ పవార్ మరణం.. ప్రైవేట్ జెట్ కంపెనీకి షాక్భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తే ఏమౌతుందంటే..? ఐసీసీ నిబజాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీఅలా అయితే ఈ దేశం నుంచి వెళ్లిపోండి.. మెటా ప్రతినిధులకు సుప్ర 'గూడెం' బరిలో సీపీఐ మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘా అరచేతిలో ప్రచారాస్త్రం ఏపీ మంత్రివర్గ సమావేశం.. చర్చిస్తున్న అంశాలివే లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన.. ఒలింపిక్ సైట్‌ల సందర్శ అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధాని రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. బీ ఫామ్ దక్కేదెవరికో..? ప్రైవేట్ జెట్ కంపెనీకి షాక్ భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తే ఏమౌతుందంటే..? ఐసీసీ నిబజాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీఅలా అయితే ఈ దేశం నుంచి వెళ్లిపోండి.. మెటా ప్రతినిధులకు సుప్ర గూడెం' బరిలో సీపీఐమున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘాఅరచేతిలో ప్రచారాస్త్రంఏపీ మంత్రివర్గ సమావేశంఒలింపిక్ సైట్‌ల సందర్శఅయితే, వీరు ఏడాదికి పైగా విదేశాల్లో నివసించి తిరిగి వస్తున్న వారు లేదా భారత సంతతి పర్యాటకులైనా అయి ఉండాలి. ఈ

# నింగికి ఎగిసి..
# నిలబడ్డ భారత స్టాక్ మార్కెట్లు

భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో నేడు ఒక అద్భుతమైన రోజుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల పవనాలు, దేశీయంగా కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీ లాభాలను ఆర్జించాయి. ప్రధానంగా సెన్సెక్స్ ఏకంగా 2,072 పాయింట్లు లాభపడి మదుపర్ల సంపదను భారీగా పెంచింది. సెన్సెక్స్ 83,739.00 వద్ద ముగిసింది. నిఫ్టీ 639.00 పాయింట్లు ఎగబాకి 25,727.55 వద్ద స్థిరపడింది.
అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధాని రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్..బీ ఫామ్ దక్కేదెవరికో..?
అలాంటి వారికి పోలీసు ట్రీట్మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగ అజిత్ పవార్ మరణం.. ప్రైవేట్ జెట్ కంపెనీకి షాక్
భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తే ఏమౌతుందంటే..? ఐసీసీ నిబ జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీఅలా అయితే ఈ దేశం నుంచి వెళ్లిపోండి.. మెటా ప్రతినిధులకు సుప్ర'గూడెం' బరిలో సీపీఐ మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘాఅరచేతిలో ప్రచారాస్త్రంఏపీ మంత్రివర్గ సమావేశం.. చర్చిస్తున్న అంశాలివేలండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన..





ఒలింపిక్ సైట్‌ల సందర్శ
అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధానిరైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్..
బీ ఫామ్ దక్కేదెవరికో..?
అలాంటి వారికి పోలీసు ట్రీట్మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగఅజిత్ పవార్ మరణం..
ప్రైవేట్ జెట్ కంపెనీకి షాక్
భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తే ఏమౌతుందంటే..? ఐసీసీ నిబ జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీఅలా అయితే ఈ దేశం నుంచి వెళ్లిపోండి.. మెటా ప్రతినిధులకు సుప్ర'గూడెం' బరిలో సీపీఐ మున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘాఅరచేతిలో ప్రచారాస్త్రం ఏపీ మంత్రివర్గ సమావేశం.. చర్చిస్తున్న అంశాలివే లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన.. ఒలింపిక్ సైట్‌ల సందర్శమార్కెట్ విజృంభణకు ప్రధాన కారణాలు:
ఇండియా-యుఎస్ ట్రేడ్ డీల్ ఆశలు, టారిఫ్ తగ్గింపు వార్తలతో భారీ ర్యాలీ నమోదైంది.
ఇవాళ (ఫిబ్రవరి 3, 2026)న సెన్సెక్స్ 2,072 పాయింట్లు, నిఫ్టీ 639 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయిల వైపు దూసుకెళ్లాయి.
సెన్సెక్స్: 83,739 వద్ద ముగిసింది. 2,072 పాయింట్లు (సుమారు 2.54%) లాభం.నిఫ్టీ: 25,727.55 వద్ద సెటిల్ అయింది. 639 పాయింట్లు (సుమారు 2.55%) పెరిగింది.ఇంట్రాడేలో సెన్సెక్స్ 85,871 వరకు, నిఫ్టీ 26,300పైగా ఎగిరింది -- ఇది.. ఒక రోజులో అతిపెద్ద గెయిన్స్‌లో ఒకటిగా రికార్డు.మార్కెట్ బ్రెడ్త్ పాజిటివ్: అడ్వాన్సింగ్ స్టాక్స్.. డిక్లైనింగ్‌ల కంటే ఎక్కువగా ఉన్నాయి(ఎక్కువ స్టాక్స్ లాభాల్లోనే).అంతర్జాతీయ సానుకూలతలు: గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల పరిస్థితులు భారత మార్కెట్‌కు ఊతమిచ్చాయి.




## ఇవాళ మధ్యాహ్నానికి కొంత రికవరీ చూసిన బంగారం, వెండి ధరలు

ఫిబ్రవరి 3: రికార్డు స్థాయి ధరలకు చేరుకుని గత ఐదు రోజులుగా భారీగా పతనమవుతోన్న బంగారం, వెండి ధరలు అదే తీరును కొనసాగిస్తున్నాయి. అయితే సోమ, మంగళవారాల్లో కొంత మేర రికవరీ కూడా చూస్తున్నాయి. ఇండియా-యూఎస్ ట్రేడ్ డీల్ వార్తలు, గ్లోబల్ అనిశ్చితి, డాలర్ బలం వంటి అంశాలు ధరలపైప్రభావంచూపుతున్నాయి.అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధానిరైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్..బీ ఫామ్ దక్కేదెవరికో..?అలాంటి వారికి పోలీసు ట్రీట్మెంట్ ఖాయం.. మంత్రి అనిత వార్నింగఅజిత్ పవార్ మరణం.. ప్రైవేట్ జెట్ కంపెనీకి షాక్భారత్‌తో మ్యాచ్‌ను పాక్ బహిష్కరిస్తే ఏమౌతుందంటే..? ఐసీసీ నిబజాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్, బీజేపీఅలా అయితే ఈ దేశం నుంచి వెళ్లిపోండి.. మెటా ప్రతినిధులకు సుప్ర'గూడెం' బరిలో సీపీఐమున్సిపల్ ఎన్నికల ఖర్చులపై నిశిత నిఘాఅరచేతిలో ప్రచారాస్త్రంఏపీ మంత్రివర్గ సమావేశం..

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?



ఆరోగ్యాన్ని కాపాడడంలో మూత్రపిండాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. రక్తం నుండి విష పదార్థాలను తొలగించడం, శరీరంలో ద్రవాలను సమతుల్యం చేయడం, సోడియం, పొటాషియం, క్యాల్షియం వంటి ఖనిజాలను నియంత్రించడం వంటి ముఖ్యమైన విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి. కనుక మనం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిని ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరం కాకుండా కాపాడుకోవచ్చు.

కోలుకునే సమయం కూడా తక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్యలను ముందుగానే గుర్తించడం వల్ల వ్యాధి మరింత తీవ్రతరం కాకుండా అడ్డుకోవచ్చు. దీంతో శరీర ఆరోగ్యం కూడా దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.
అలసట, బలహీనత..

సకాలంలో చికిత్స తీసుకోవడం వల్ల మూత్రపిండాల వ్యాధిని సమర్థవంతంగా తగ్గించుకోవచ్చు.

ముందుగా మూత్రపిండాల వ్యాధులను వల్ల గుర్తించడం వల్ల మూత్రపిండాల పనితీరును మెరుగుపరుచుకోవడంతో పాటు మూత్రపిండాల మార్పిడి, డయాలసిస్ వంటి చికిత్స విధానాలను అరికట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. కనుక మూత్రపిండాల సమస్యలను ముందుగా గుర్తించడం చాలా అవసరమని వారు పేర్కొంటున్నారు. మూత్రపిండాల వ్యాధులను గుర్తించే కొన్ని లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. మూత్రపిండాల పనితీరు తగ్గడం వల్ల శరీరంలో విష పదార్థాలు పేరుకుపోతాయి. ఇది క్రమంగా అలసట, బలహీనతకు దారి తీస్తాయి. మూత్రపిండాల వ్యాధులు రక్తహీనతకు కూడా మూత్ర విసర్జనలో మార్పులు..
మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారిలో మూత్ర విసర్జనలో మార్పులు వస్తాయి. మూత్రపిండాల వ్యాధులను గుర్తించే ప్రారంభ సంకేతాల్లో ఇది ఒకటి. రాత్రి సమయంలో మూత్ర విసర్జన పెరగడం,మూత్రంలో రక్తం రావడం వంటి లక్షణాలు కూడా మూత్రపిండాల వ్యాధులను తెలియజేస్తాయి.

# గోధుమ రోటీలు కాదు..
## వీటిని తింటే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి..!



చాలా మంది భారతీయులకు రోటీ అనేది రోజు వారి ఆహారమే అని చెప్పవచ్చు. దాని వల్ల కలిగే మేలు , పోషకాల గురించి ఆలోచించకుండా గోధుమ రోటీలని రోజూ తింటూనే ఉంటారు. గోధుమ రోటీలని ఎక్కువగా తీసుకున్నప్పటికీ ఇవి అందరికీ ఎల్లప్పుడూ మేలు చేస్తాయని చెప్పలేం. గోధుమ రోటీలని ఎక్కువగా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, జీర్ణ సమస్యలు, పోషకాహార లోపం వంటి ఇబ్బందులు కూడా కలుగుతాయి. కనుక గోధుమ రోటీలకి బదులుగా తృణ ధాన్యాలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలతో చేసిన రోటీలను తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ రోటీలు ఒక్కొక్కటి ఒక్కో రుచిని, ఆరోగ్యప్రయోజనాలను అందిస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ రోటీలకు బదులుగా మనం తీసుకోదగిన ఇతర రోటీలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.
సజ్జరోటీ, జొన్న రోటీ, రాగి రోటీ, మక్కీ రోటీ..





మనం గోధుమలకు బదులుగా సజ్జలతో చేసిన రోటీలను కూడా తీసుకోవచ్చు. సజ్జల్లో ఐరన్, మెగ్నీషియం, ఫ్లేవనాయిడ్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఫైటో న్యూట్రియెంట్లు వంటి పోషకాలు ఉంటాయి. సజ్జ రోటీలను తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరం బలంగా తయారవుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు ఉన్న వారికి సజ్జ రోటీలు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే జొన్నల్లో కూడా ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, బి విటమిన్లు వంటి పోషకాలు ఎక్కువగా క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇవి గ్లూటెన్ రహితమైనవి కనుక గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. జొన్న రొట్టెలను తీసుకోవడం వల్ల బరువు తగ్గవచ్చు. గుండె ఆరోగ్యం, జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

ఎముకల ఆరోగ్యానికి రాగులు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో అధికంగా ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా చేయడంలో సహాయపడుతుంది. రాగుల్లో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. అతిగా తినడం తగ్గిస్తుంది. దీంతో శరీర బరువు అదుపులో ఉంటుంది. రాగి రోటీలను తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరగడంతో పాటు శరీరం దృఢంగా తయారవుతుంది. అదే విధంగా గోధుమరోటీలకు బదులుగా మనం మొక్కజొన్నతో కూడా రోటీలను తయారు చేసి తీసుకోవచ్చు. వీటిలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల త్వరగా శక్తి లభిస్తుంది. అయితే వీటిని మితంగా తీసుకోవాలి. ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
బియ్యం రోటీ, బేసన్ రోటీ, ఓట్స్ రోటీ..

ఇక సున్నితమైన జీర్ణక్రియ ఉన్నవారు బియ్యం రోటీలను తీసుకోవచ్చు. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. పొట్టకు తేలికగా ఉంటాయి. బేసన్ రోటీలో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కండరాల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలిగి చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. తద్వారా బరువు తగ్గుతారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఓట్స్ మనకు ఎంతో సహాయపడతాయి. ఓట్స్ తో రోటీలను తయారు చేసి తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ విధంగా మనం గోధుమ రోటీలకు బదులుగా ఇతర ధాన్యాలతో చేసిన రోటీలను కూడా తీసుకోవచ్చని వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

# తారక్‌తోనే గాడ్ ఆఫ్ వార్






గాడ్ ఆఫ్ వార్ ..టాలీవుడ్ లో ఈ సినిమా చుట్టూ నడుస్తున్న డిస్కషన్ మరే సినిమాకు ఇటీవల కాలంలో జరగలేదేమో. మొదట ఈ సినిమా అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్ లో వస్తుందని ప్రకటించారు. కానీ బన్నీ నటించిన పుష్ప తర్వాత సీన్ మారింది. పాన్ ఇండియా మార్కెట్ పై కన్నేసిన బన్నీ తెలుగు దర్శకులతో సినిమా చేసే ఇంట్రెస్ట్ చూపలేదు. దాంతో త్రివిక్రమ్ ఈ కథని ఎన్టీఆర్ చేయాలనీ డిసైడ్ అయ్యాడు. ఎన్టీఆర్ కు కథ చెప్పడం అందుకు ఓకే చెప్పడం కూడా జరిగింది. ఎన్టీఆర్ కూడా కుమారస్వామికు సంబంధించి బుక్ ను చదువుతూ మీడియా కంటపడంతో త్రివిక్రమ్ ? ఎన్టీఆర్ సినిమా ఫిక్స్ అని న్యూస్ హల్ చల్ చేసాయి. యుద్దానికి అధిపతిగా, దైవ స్వరూపంగా తారక్ నటన మరియు ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇంతకుముందు ఎన్నడూ చూడని విధంగా ఒక విజువల్ గ్రాండియర్‌గా త్రివిక్రమ్ ఈ కథను సిద్ధం చేసాడని టాక్ వినిపించింది. కానీ మొన్నామధ్య ఈ సినిమాని అల్లు అర్జున్ చేయాలనుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియాతో ఫేక్ ప్రాపగాండా చేశారు. దాంతో అసలు ఈ సినిమా ఎవరితో ఉంటుందా అని కన్ఫ్యూజ్ అయ్యారు సినిమా ప్రేక్షకులు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా అన్ని గందరగోళాల తర్వాత చివరికి తారక్ వద్దకు వచ్చి చేరింది. ప్రస్తుతం ఎన్టీఆర్ చేస్తున్న ప్రశాంత్ నీల్ సినిమా జూన్ 2026 నాటికి పూర్తి కానుంది. ఆ వెంటనే అంటే 'గాడ్ ఆఫ్ వార్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ లోపు త్రివిక్రమ్ ప్రస్తుతం చేస్తున్న వెంకీ సినిమా పూర్తి చేసి, ఈ పౌరాణిక చిత్రం కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను పాన్-వరల్డ్ స్థాయిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాయి.

## రెయిన్ మ్యాన్ అంటూ ఆటపట్టించేవారు: మాధవన్



ఇటీవల 'ధురంధర్'లో కనిపించి ఆకట్టుకున్న నటుడు మాధవన్.. ఆ సినిమా షూటింగ్‌లో అందరూ తనను 'రెయిన్ మ్యాన్' అని పిలిచేవారని తెలిపారు. తాను ఎప్పుడు సెట్‌కు వెళ్లినా వర్షం పడేదని అందుకే అందరూ తనను అలా పిలిచేవారని చెప్పారు. ఆ సినిమాలో ఎక్కువ సన్నివేశాలు ఎండ లేకుండా తెరకెక్కించినవేనని.. అవే సినిమాకు మరింత అందానిచ్చాయని తెలిపారు. ఇకపోతే తన గ్యాప్‌పై ఆయన వివరాఉల పంచుకున్నారు. విశ్రాంతి అవసరం అనిపించి నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్గ÷ప్పారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖడూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు. 'నేను చేస్తున్న పనిపై నిరాశ కలిగింది. అందుకే కొన్ని రోజులు విరామం తీసుకోవాలని భావించా. నాలుగేళ్లు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నాను.

## ఇక్కడ.. నాకు ఆ కష్టాలు తప్పలేదు

పిఆర్‌పై పెద్దగా ఆధారపడను:



రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.

---

దరుంధర్-2 టీజర్ విడుదల

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. 'ధురంధర్:ది రివెంజ్' పేరుతో మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మొదటి భాగం హిందీలో మాత్రమే విడుదల కాగా.. రెండో పార్ట్ హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. 'ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది' అని రణ్‌వీర్ సింగ్ రివెంజ్ డైలాగుతో అదరగొట్టారు.







# దురంధర్-2 షూట్‌లో డ్రోన్ వినియోగం

ముంబైలోని హై-సెక్యూరిటీ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ కెమెరాను ఉపయోగించినందుకు గాను బాలీవుడ్ మూవీ 'ధురంధర్ 2' చిత్ర బృందంపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. దక్షిణ ముంబైలోని పోర్ట్ ప్రాంతంలో ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా డ్రోన్‌ను వినియోగించినందుకు చిత్ర లొకేషన్ మేనేజర్ రింకూ రాజ్‌పాల్ వాల్మీకిపై పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు సమాచారం.గత మూడు రోజులుగా ముంబై ఫోర్ట్ ప్రాంతంలో 'ధురంధర్ 2' షూటింగ్ కొనసాగుతుండగా, చిత్ర బృందం ఈ చారిత్రాత్మక ఫోర్ట్ ప్రాంతాన్ని పాకిస్తాన్‌లోని ఒక పాత వీధిని తలపించేలా సెట్ వేసింది. ఫిబ్రవరి 1న జరిగిన షూటింగ్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలోనే నిబంధనలకు విరుద్ధంగా గాలిలోకి డ్రోన్‌ను ఎగురవేయడం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ముంబైలోని పోర్ట్ ప్రాంతం ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక సంస్థలకు కేంద్రం కావడంతో ఇక్కడ భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై కఠినమైన ఆంక్షలు అమలులో ఉన్నాయి. అలాగే డ్రోన్ ఎగురవేయడానికి ముందు తీసుకోవాల్సిన తప్పనిసరి అనుమతులను చిత్ర యూనిట్ తీసుకోలేదని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు లొకేషన్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఎవరినీ అరెస్టు చేయనప్పటికీ, భద్రతా నిబంధనల ఉల్లంఘనపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు. హై-సెక్యూరిటీ జోన్లలో షూటింగ్ జరుపుకునేటప్పుడు చట్టపరమైన అనుమతులు కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్




రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు

బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృధ్వి రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు- ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com